సాహో సఫారీలు

డబ్ల్యూటీసీ టైటిల్ కైవసం

ఫైనల్లో ఆస్ట్రేలియాపై అద్భుత విజయం • మార్క్‌రమ్ సూపర్ సెంచరీ • 27 ఏండ్ల ఐసీసీ ట్రోఫీ నిరీక్షణకు తెర

జూన్ 14, 2025..దక్షిణాఫ్రికా క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయ సందర్భం! ఎన్నో ఏండ్లుగా కండ్లు కాసేలా ఎదురుచూసిన క్షణం ఇన్నాళ్లకు సాకారమైంది. క్రికెట్‌కు పుట్టినిల్లు అయిన చారిత్రక లార్డ్స్ మైదానం వేదికగా దక్షిణాఫ్రికా కొత్త చరిత్ర లిఖించింది. ప్రతిష్టాత్మక ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)లో టైటిల్ విజేతగా నిలిచి తమ చిరకాల కలను సాకారం చేసుకుంది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాను మట్టికరిపిస్తూ దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఐసీసీ ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది. నిర్దేశిత లక్ష్యఛేదనలో సహచరులు విఫలమైనా తాను ఉన్నానంటూ మార్క్‌రమ్ వీరోచిత సెంచరీతో దక్షిణాఫ్రికా విజయంలో కీలకమయ్యాడు. స్టార్ పేస్ త్రయాన్ని దీటుగా ఎదుర్కొంటూ మార్క్‌రమ్ చారిత్రక ఇన్నింగ్స్‌తో కదంతొక్కిన వేళ లార్డ్స్ మైదానం..సఫారీల సంబురంతో కొత్త కలను సంతరించుకుంది.

లండన్: దక్షిణాఫ్రికా క్రికెట్ చరిత్రలో నూతన అధ్యాయం! ఇన్నాళ్లు అందని ద్రాక్షగా ఊరిస్తూ వస్తున్న ఐసీసీ ట్రోఫీ ఎట్టకేలకు దరి చేరింది. లార్డ్స్ మైదానం వేదికగా శనివారం ముగిసిన ఫైనల్లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై చిరస్మరణీయ విజయం సాధించింది. తద్వారా 27 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత సఫారీలు ఐసీసీ ట్రోఫీని సగర్వంగా దక్కించుకున్నారు. ఆసీస్ నిర్దేశించిన 282 పరుగుల లక్ష్యఛేదన కోసం ఓవర్‌నైట్ స్కోరు 213/2తో శనివారం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన దక్షిణాఫ్రికా 5 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. ఓవర్‌నైట్ బ్యాటర్లు మార్క్‌రమ్(207 బంతుల్లో 136, 14ఫోర్లు) సూపర్ సెంచరీతో కదంతొక్కగా, గాయాన్ని కూడా లెక్కచేయకుండా కెప్టెన్ తెంబా బవుమా(66) సాధికారిక అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. బవుమా, స్టబ్స్(8), మార్క్‌రమ్ వికెట్లు కోల్పోయినా..బెడింగ్‌హామ్(21 నాటౌట్), కైల్ వెరినె(4 నాటౌట్) జట్టును గెలుపు తీరాలకు చేర్చారు. స్టార్క్(3/66)మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. అద్భుత సెంచరీతో జట్టు చిరస్మరణీయ విజయంలో కీలకమైన మార్క్‌రమ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

సంక్షిప్త స్కోర్లు:
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212, ఆలౌట్ దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్, ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 207 ఆలౌట్, దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 282/5(మార్క్‌రమ్ 136, బవుమా 66, స్టార్క్ 3/66, హాజిల్‌వుడ్ 1/58)

ప్రైజ్‌మనీ:
దక్షిణాఫ్రికా – 30.78 కోట్లు
ఆస్ట్రేలియా – రూ. 18.56 కోట్లు

మార్క్‌రమ్ సూపర్!

నిర్దేశిత లక్ష్యఛేదన కోసం శనివారం ఆట కొనసాగించిన సఫారీలకు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. గాయంతోనే ఇన్నింగ్స్ కొన సాగించిన బవుమా తన ఓవర్‌నైట్ స్కోరు ఒక పరుగు మాత్రమే జతచేస్తూ కమిన్స్ బౌలింగ్‌లో కీపర్ క్యారీకి క్యాచ్ ఇచ్చి మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో మార్క్‌రమ్‌తో 147 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత వచ్చిన స్టబ్స్ కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలదొక్కుకోలేకపోయాడు. దీన్ని తమకు అనుకూలంగా మలుచుకున్న ఆసీస్ స్టార్ పేసర్ స్టార్క్..స్టబ్స్‌ను క్లీన్ బౌల్డ్ చేసి జట్టును పోటీలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. స్టబ్స్ ఔటయ్యే సమయానికి సఫారీలు విజయానికి 41 పరుగుల దూరంలో ఉన్నారు. ఆ తర్వాత వచ్చిన బెడింగ్‌హామ్..మార్క్‌రమ్‌కు జతకలిశాడు. ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరిగిన మార్క్‌రమ్ కీలకమైన రెండో ఇన్నింగ్స్‌లో తన సత్తాఏంటో చూపెట్టాడు. అయితే హాజిల్‌వుడ్ బౌలింగ్‌లో మార్క్‌రమ్ ఔట్ కావడంతో సఫారీ శిబిరంలో ఒకింత ఆందోళన చెలరేగింది. విజయానికి మరో 10 పరుగులు అవసరమైన దశలో వెరినె విన్నింగ్ షాట్‌తో దక్షిణాఫ్రికాకు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు.

చోకర్స్ ముద్రను చెరిపేసి

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

దక్షిణాఫ్రికా క్రికెట్‌లో నవశకానికి నాంది పడింది. క్రికెట్‌కు పుట్టినిల్లుగా పేరు గాంచిన లార్డ్స్ మైదానం ఇందుకు వేదికైంది. ఎక్కడ కోల్పోయామో అక్కడే వెతుక్కోవాలనే చందంగా 1999 వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఎదురైన అనూహ్య ఓటమికి దక్షిణాఫ్రికా ఇన్నేండ్లకు బదులు తీర్చుకుంది. అనాడు గెలిచే మ్యాచ్‌ను చేజేతులా వదిలిపెట్టుకున్న సఫారీలు ఈసారి అలాంటి తప్పును మళ్లీ పునరావృతం చేయకుండా జాగ్రత్త పడారు. నిషేధం నుంచి బయటిపడి 1991లో తిరిగి తమ ప్రస్థానాన్ని మొదలుపెట్టిన నాటి నుంచి నేటి వరకు దక్షిణాఫ్రికాకు ఐసీసీ టోర్నీలు ఎన్నడూ కలిసి రాలేదు. 1992 వన్డే ప్రపంచకప్‌లో వరుణుడు విలన్‌గా మారి వారి తలరాత తలకిందులు చేస్తే ప్రతీ టోర్నీలో వారిని అదృష్టం వెక్కిరిస్తూనే వచ్చింది. 1998లో హ్యాన్సీ క్రానె కెప్టెన్సీలో అందరి అంచనాలు మారుస్తూ నాకౌట్(చాంపియన్స్ ట్రోఫీ) ట్రోఫీ రూపంలో దక్షిణాఫ్రికాకు తొలి ఐసీసీ టైటిల్ దక్కింది. అప్పటి నుంచి దాదాపు ప్రతీ మేజర్ టోర్నీలో సఫారీలకు నిరాశే ఎదురైంది. అద్భుత ప్రతిభ కల్గిన ప్లేయర్లు ఉన్నా..అదృష్టం కలిసిరాక టైటిల్‌కు ఆమడ దూరంలో నిలిచిన సందర్భాలు కోకొల్లలు. అటు పురుషులతో పాటు మహిళల టోర్నీల్లోనూ ఓటములతో దక్షిణాఫ్రికా 'చోకర్స్' ముద్ర మూటగట్టుకుంది. వెస్టిండీస్ వేదికగా నిరుడు జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లోనూ భారత్ చేతిలో ఓటమిపాలైంది. ఈఏడాది ఆరంభంలో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో సెమీస్‌లోనే వెనుదిరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే దక్షిణాఫ్రికాకు ఉన్న దురదృష్టం ప్రపంచంలో మరే జట్టుకు లేకపోవడం. అయితే వీటన్నింటికి పుల్‌స్టాప్ పెడుతూ, తమ అదృష్ట రేఖలను మార్చుకుంటూ సఫారీలు ఎట్టకేలకు తమ ఐసీసీ ట్రోఫీ కలను సాకారం చేసుకోవడంలో సఫలమయ్యారు. మెగాటోర్నీల్లో కొరకరాని కొయ్య అయిన ఆస్ట్రేలియాను ఓడిస్తూ డబ్ల్యూటీసీలో చాంపియన్‌గా నిలిచి ఇన్నాళ్లుగా తమపై ఉన్న చోకర్స్ ముద్రను చెరిపేసుకున్నారు. ఈ క్రమంలో దిగ్గజాలకు సాధ్యం కాని రికార్డును కెప్టెన్ బవుమా చేతల్లో చేసి చూపెట్టాడు.

ఆర్య, అర్జున్ జోడీ పసిడి గురి

ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్

మ్యూనిచ్: ప్రతిష్టాత్మక ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది. శనివారం జరిగిన 10మీటర్ల ఎయిర్‌రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌ఈవెంట్‌లో భారత యువ జోడీ ఆర్యబోర్సె, అర్జున్ బబుత పసిడి పతకంతో మెరిసింది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన స్వర్ణ పతక పోరులో ఆర్య, అర్జున్ ద్వయం 17 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా, చైనాకు చెందిన వాంగ్ జెఫీ, షెంగ్ లివాహో జంట 7 పాయింట్లతో రజతం సొంతం చేసుకుంది. అంతకుముందు జరిగిన అర్హత రౌండ్ పోరులో ఆర్య, అర్జున్ జోడీ 635.2 పాయింట్లతో రెండో స్థానంలో నిలువగా, చైనా షూటర్లు 635.9 పాయింట్లతో అగ్రస్థానంలో ఫైనల్లోకి ప్రవేశించారు. మరోవైపు 10మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్‌ఈవెంట్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో మనుభాకర్, ఆదిత్య మల్రా జోడీ 577 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచి నిరాశపరిచింది.

ప్రణతికి కాంస్యం

ఏషియన్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: దక్షిణకొరియా వేదికగా జరుగుతున్న ఏషియన్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్‌లో భారత యువ జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ కాంస్య పతకంతో మెరిసింది. శనివారం జరిగిన మహిళల వాల్ట్ ఫైనల్లో ప్రణతి 13.466 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో యిహాన్ జాంగ్ (13.650, చైనా), తీ క్విన్స్ న్యుజెన్ (13.583, థాయ్‌లాండ్) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. భారత్‌కే చెందిన ప్రాతిస్థా సమంత(13.016) నాలుగో స్థానంలో నిలిచి తృటిలో పతకం సాధించే అవకాశాన్ని కోల్పోయింది. టోర్నీలో అద్భుత ప్రదర్శనతో ఏషియన్ టోర్నీలో మూడో పతకం సొంతం చేసుకున్న ప్రణతి..వెటరన్ జిమ్నాస్ట్ దీపాకర్మాకర్(2)ను అధిగమించింది.

తెలంగాణ సెయిలర్ల పతక జోరు

ముగిసిన మాన్‌సూన్ రెగెట్టా టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హుసేన్‌సాగర్ వేదికగా జరిగిన జాతీయ మాన్‌సూన్ రెగెట్టా చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సెయిలర్లు పతక జోరు కనబరిచారు. ఆరు రోజుల పాటు జరిగిన రెగెట్టా టోర్నీ శనివారంతో ముగిసింది. వివిధ విభాగాల్లో తెలంగాణ సెయిలర్లు సత్తాచాటుతూ పతకాలు కొల్లగొట్టారు. బాలుర అండర్-15 విభాగంలో మహమ్మద్ రిజ్వాన్ పసిడి పతకం గెలుచుకోవడమే గాక 'బాయ్స్' ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. అండర్-19 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తనుజ కామేశ్వర్- శ్రవణ్ కత్రావత్ జోడీ స్వర్ణం దక్కించుకుంది. అండర్-15 బాలికల విభాగంలో రాష్ట్ర సెయిలర్ లాహిరి కొమురవెల్లి రజత పతకం సొంతం చేసుకుంది. దీనితో పాటు ప్రతిష్టాత్మక ఎస్‌హెచ్ బాబు స్మారక ట్రోఫీని దక్కించుకుంది. అండర్-19 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో దీక్షిత, గణేశ్ రజతం సాధించారు. అండర్-15 బాలికల విభాగంలో చంద్రలేఖ, బాలుర కేటగిరీలో వినోద్ కాంస్యాలు కైవసం చేసుకున్నారు.

ప్రపంచ కుబేరుడిగా మస్క్

ఫోర్బ్స్ జాబితాలో భారతీయులు

పేరు	సంపద విలువ (బిలియన్ డాలర్లలో)	ర్యాంక్
ముకేశ్ అంబానీ	107.6	16
గౌతమ్ అదానీ	65.6	24
శివ్‌నాడర్	37.4	46
సావిత్రి జిందాల్	36.7	47
దిలీప్ సంఘ్వీ	26.4	75
సైరస్ పూనావాలా	24.7	82
కుమారం మంగళం బిర్లా	21.1	101
కుషాల్ పాల్ సింగ్	18.6	113
లక్ష్మీ మిట్టల్	18	121
రాధాకృష్ణ దమాని	17.4	126
ఉదయ్ కొటక్	15.2	160
తెలుగువారు		
మురళీ దివీస్	10.9	249
పార్థసారథి రెడ్డి	3.9	973
ప్రతాప్ రెడ్డి	3.3	1149
జీఎం రావు	3.3	1160
మహిమా దాట్ల	3.2	1178
పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి	3	1294
ఎం సత్యనారాయణ రెడ్డి	2.6	1446
జూపల్లి రామేశ్వర్ రావు	2.4	1548
పీవీ కృష్ణా రెడ్డి	2.2	1715
పీవీ రెడ్డి	2.1	1787
టాప్-5 ప్రపంచ కుబేరులు		
ఎలాన్ మస్క్	410	1
ల్యారీ ఎల్లిసన్	258	2
మార్క్ జుకర్‌బర్గ్	235.7	3
జెఫ్ బెజోస్	226.8	4
వారెన్ బఫెట్	152.1	5

410 బిలియన్ డాలర్ల సంపదతో తొలి స్థానం

రెండో స్థానానికి ఎగబాకిన ఒరాకిల్ అధినేత ల్యారీ

ఫోర్బ్స్ మ్యాగజైన్ 2025 జాబితాలో వెల్లడి

న్యూయార్క్, జూన్ 14: ప్రపంచ శ్రీమంతుల జాబితాలో ఎలాన్ మస్క్ హవా కొనసాగుతున్నది. ప్రస్తుత సంవత్సరానికిగాను ఫోర్బ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన ప్రపంచ కుబేరుల జాబితాలో 410 బిలియన్ డాలర్ల సంపదతో తన తొలి స్థానాన్ని పదిలం చేసుకున్నారు. అమెరికా అధ్యక్షుడితో విభేదాలు ఏర్పడినప్పటి నుంచి ఆయన సంపద భారీగా నష్టపోయినప్పటికీ తన తొలిస్థానాన్ని దక్కించుకోవడం విశేషం. మరోవైపు, గత కొన్నేండ్లుగా వరుస స్థానాల్లో కొనసాగిన అమెజాన్ అధినేత బెజోస్, మెటా చీఫ్ జెఫ్ బెజోస్‌లకు గట్టి షాక్ తగిలింది. ఒరాకిల్ అధినేత ల్యారీ ఎలిసన్ ఈసారికిగాను రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. కంపెనీ ఆర్థిక ఫలితాలు అంచనాలకుమించి రాణించడంతో సంస్థ షేరు రాకెట్ వేగంతో దూసుకుపోయింది. దీంతో ఆయన సంపద 40 బిలియన్ డాలర్లు ఎగబాకి 258 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఒరాకిల్ షేరు గురువారం 13 శాతం ఎగబాకి 215 డాలర్లకు చేరుకున్నది. ఈవారంలోనే సంస్థ మార్కెట్ విలువ 40 బిలియన్ డాలర్లు ఎగబాకినట్టు అయింది. అలాగే మెటా సీఈవో మార్క్ జూకర్‌బర్గ్(238 బిలియన్ డాలర్లు), అమెజాన్ చైర్మన్ జెఫ్ బెజోస్(228 బిలియన్ డాలర్లు) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు.

దేశీయ శ్రీమంతుల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ తన తొలి స్థానాన్ని కాపాడుకున్నారు. ఆయన సంపద 107.6 బిలియన్ డాలర్లని ఫోర్బ్స్ మ్యాగజైన్ నివేదిక వెల్లడించింది. ఆ తర్వాతి స్థానంలో గౌతమ్ అదానీ 65.6 బిలియన్ డాలర్లతో నిలిచారు.

వాణిజ్య

ఎస్బీఐ రుణాలు చౌక

హోమ్ లోన్లపై అర శాతం తగ్గిన వడ్డీరేటు

8.65% నుంచి 8.15 శాతానికి దిగొచ్చిన ఈబీఎల్ఆర్

ముంబై, జూన్ 14: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) రుణాలపై వడ్డీరేట్లు తగ్గాయి. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్ఆర్)ను అర శాతం (50 బేసిస్ పాయింట్లు) తగ్గించినట్టు బ్యాంక్ ప్రకటించింది. దీంతో ఇప్పుడు ఈబీఎల్ఆర్ 8.65 శాతం నుంచి 8.15 శాతానికి దిగొచ్చింది. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జరిపిన ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఎస్బీఐ తాజా నిర్ణయం తీసుకున్నది. ఇప్పటికే ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించిన సంగతీ విదితమే.

గృహ రుణాలకు జోష్

ఎస్బీఐ ఈబీఎల్ఆర్ తగ్గింపు రుణగ్రహీతలకు, ముఖ్యంగా గృహ రుణగ్రహీతలకు లాభించనున్నది. ఈబీఎల్ఆర్‌తో అనుసంధానమైన పాత, కొత్త గృహ రుణగ్రహీతలందరికీ తాజా నిర్ణయం ప్రయోజనం చేకూర్చుతుంది. ఈబీఎల్ఆర్ తగ్గింపుతో గృహ రుణాలపై వడ్డీ రేట్లు 7.50 శాతం నుంచి 8.45 శాతం మధ్య ఉండనున్నాయి. రుణగ్రహీతల క్రెడిట్ స్కోర్ ఆధారంగా ఈ వడ్డీరేట్లలో వ్యత్యాసం ఉంటుంది.

అమృత్ వృష్టిపై తగ్గిన వడ్డీరేటు

ఎస్బీఐ ప్రత్యేకంగా 444 రోజుల కాలపరిమితితో అందిస్తున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) స్కీం 'అమృత్ వృష్టి'పై పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) వడ్డీరేటు తగ్గింది. ఆదివారం (జూన్ 15) నుంచి సవరించిన వడ్డీరేట్లు అమల్లోకి వస్తాయి. కాగా, మిగతా రెగ్యులర్ ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు యథాతథంగానే ఉన్నాయి. గత నెల్లోనే వీటిని సవరించినది తెలిసిందే. అయితే ఇటీవలి ద్రవ్యసమీక్షలో రెపోరేటుకు ఆర్బీఐ అరశాతం కోత పెట్టిన నేపథ్యంలో ఇప్పటికే ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, కెనరా తదితర బ్యాంకులు తమ ఎఫ్‌డీలపై వడ్డీరేట్లను తగ్గించాయి. దీంతో ఎస్బీఐ కూడా ఆ దిశగా అడుగులు వేసింది. బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం సాధారణ కస్టమర్లకు అమృత్ వృష్టి ఎఫ్‌డీపై 6.60 శాతం వార్షిక వడ్డీరేటు దక్కుతుంది. ఇంతకుముందు ఇది 6.85 శాతంగా ఉన్నది. సీనియర్ సిటిజన్లకు 7.10 శాతం వర్తిస్తుంది. అయితే 80 ఏండ్లు, ఆపై వయసున్న డిపాజిటర్లకు 10 బేసిస్ పాయింట్ల అదనపు ప్రయోజనం లభిస్తుంది. దీంతో వీరంతా 7.20 శాతం వడ్డీరేటు అందుకోవచ్చు. అయితే అమృత్ వృష్టి ఎఫ్‌డీలను నిర్ణీత కాలపరిమితి కంటే ముందే ఉపసంహరించుకుంటే జరిమానాలుంటాయి. రూ.5 లక్షలదాకా రిటైల్ టర్మ్ డిపాజిట్లకు సంబంధించి వడ్డీరేటులో 0.50% పెనాల్టీ వర్తిస్తుంది. అలాగే రూ.5 లక్షలు-3 కోట్లలోపుండే రిటైల్ టర్మ్ డిపాజిట్లకు అన్ని టెన్యూర్‌పై 1 శాతం జరిమానా పడుతుంది.

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఎస్బీ ఐలో వడ్డీరేట్లు ఇలా..

కాలపరిమితి	సాధారణ కస్టమర్లు	సీనియర్ సిటిజన్లు
7-45 రోజులు	3.30%	3.80%
46-179 రోజులు	5.30%	5.80%
180-210 రోజులు	6.05%	6.55%
211-ఏడాదిలోపు	6.30%	6.80%
ఏడాది-రెండేండ్లలోపు	6.50%	7.00%
రెండేండ్లు-మూడేండ్లలోపు	6.70%	7.20%
మూడేండ్లు-ఐదేండ్లలోపు	6.55%	7.05%
ఐదేండ్లు-పదేండ్లదాకా	6.30%	7.30%

గమనిక: 7 రోజులలోపుండే డిపాజిట్లపై ఎలాంటి వడ్డీ చెల్లింపులు ఉండవు.

భారత్‌లో స్మార్ట్‌గా ఫోన్ల తయారీ

యాపిల్, సామ్‌సంగ్‌ల నుంచి డిమాండ్ • కలిసొస్తున్న ఎగుమతులు

గ్లోబల్ మార్కెట్‌లో చైనాకు గట్టి పోటీ • కౌంటర్‌పాయింట్ తాజా నివేదిక

న్యూఢిల్లీ, జూన్ 14: స్మార్ట్‌ఫోన్ల తయారీలో భారత్ దూసుకుపోతున్నది. ప్రపంచవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తిలో ఎప్పట్నుంచో ముందున్న దేశాలకు సైతం లేని గిరాకీ ఇప్పుడు భారత్‌కు ఉంటున్నది మరి. ఈ క్రమంలోనే ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా గ్లోబల్ స్మార్ట్‌ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఔట్‌పుట్ క్షీణిస్తున్నా.. భారత్‌లో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫలితంగా 2025 బిగ్ విన్నర్‌గా ఇండియానే కాగలదన్న విశ్వాసాన్ని ఓ తాజా నివేదిక వెలిబుచ్చింది. కౌంటర్‌పాయింట్ రిసెర్చ్ ఈ రిపోర్టును విడుదల చేసింది. గ్లోబల్ స్మార్ట్‌ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ అల్లోకేషన్ ట్రాకర్ ప్రకారం ఈ నివేదిక రూపొందింది.

బడా సంస్థల దన్ను

దేశంలో స్మార్ట్‌ఫోన్ల తయారీ వెనుక యాపిల్, సామ్‌సంగ్‌లే ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఇతర దేశాల్లో ఈ ఫోన్లకున్న డిమాండ్.. ఎగుమతులకు దోహదం చేస్తున్నది. ఆయా కంపెనీల స్మార్ట్‌ఫోన్లు భారత్‌లో తయారై విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది గ్లోబల్ స్మార్ట్‌ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఔట్‌పుట్ గత ఏడాదితో పోల్చితే 1% పడిపోవచ్చని అంచనాలున్నా.. ప్రపంచ ఉత్పత్తిలో రెండంకెల వృద్ధితో 20 శాతం వాటాను భారత్ సొంతం చేసుకోగల దన్న ఆశాభావం వ్యక్తమవుతున్నది. నిజానికి నిరుడు 4% వృద్ధి నమోదైంది. కానీ అమెరికా ప్రతీకార సుంకాలు, ఇండస్ట్రీలో మందగమనం.. తయారీని ప్రభావితం చేస్తున్నది.

చైనా, వియత్నాంలలో..

గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా తయారైన స్మార్ట్‌ఫోన్లలో 90 శాతానికిపైగా చైనా, భారత్, వియత్నాంలలోనే ఉత్పత్తి అయ్యాయి. ఇందులో భారత్ ఆకర్షణీయమైన వృద్ధిరేటును కనబర్చింది. ఇక ఈ ఏడాది ట్రంప్ టారిఫ్‌లతో చైనాలో స్మార్ట్‌ఫోన్ల తయారీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సుంకాల భారం, భయాలతో యాపిల్, సామ్‌సంగ్‌సహా చాలా కంపెనీలు ఆ దేశంలో ఉత్పత్తిని తగ్గించి ప్రత్యామ్నాయంగా భారత్‌ను ఎంచుకుంటున్నాయి. వియత్నాం పరిస్థితి కూడా ఇంచుమించుగా చైనా తరహాలోనే ఉన్నది. దీంతో భారత్‌లో స్మార్ట్‌ఫోన్ల తయారీ ఊపందుకున్నదని కౌంటర్‌పాయింట్ రిసెర్చ్ సీనియర్ అనలిస్ట్ ఇవాన్ లామ్ అన్నారు. కాగా, అంతర్జాతీయంగా ఉన్న సంప్రదాయ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసెస్ (ఈఎంఎస్) దిగ్గజ సంస్థలు భారత్‌లో తమ పెట్టుబడుల్ని కొనసాగిస్తున్నాయని, స్థానిక ఈఎంఎస్ కంపెనీలూ వీటికి తోడవడంతో భారత్‌లో తయారీ ప్రమాణాలు గతంతో పోల్చితే ఎంతో మెరుగయ్యాయని కౌంటర్‌పాయింట్ రిసెర్చ్ సీనియర్ విశ్లేషకుడు ప్రచిర్ సింగ్ అన్నారు.

స్పైస్‌జెట్ లాభం మూడింతలు

ముంబై, జూన్ 14: చౌక విమానయాన సంస్థ స్పైస్‌జెట్ అంచనాలకు మించి రాణించింది. మార్చితో ముగిసిన మూడునెలల కాలానికిగాను సంస్థ రూ.324.87 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.119 కోట్ల లాభంతో పోలిస్తే మూడింతల వరకు అధికమైంది. కానీ, ఆదాయం మాత్రం ఏడాది ప్రాతిపదికన 16 శాతం తగ్గి రూ.1,446.37 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.1,719.3 కోట్ల ఆదాయాన్ని గడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.5,284 కోట్ల ఆదాయంపై రూ.580.74 కోట్ల లాభాన్ని గడించింది.

ఐటీసీ చేతికి శ్రేష్ట నేచురల్

న్యూఢిల్లీ, జూన్ 14: పలు వ్యాపారాలు నిర్వహిస్తున్న ఐటీసీ.. 24 మంత్రా ఆర్గానిక్ బ్రాండ్‌కు చెందిన శ్రేష్ట నేచురల్ బయోప్రొడక్ట్స్‌ను హస్తగతం చేసుకున్నది. పూర్తిగా నగదు రూపంలో జరిగిన ఈ ఒప్పందం విలువ రూ.472.50 కోట్లుగా నిర్ణయించింది. అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న ఆర్గానిక్ ఫుడ్ ప్రొడక్ట్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం ఐటీసీకి దన్నుగా నిలువనున్నది. ఎస్ఎన్‌బీపీఎల్‌లో 100 శాతం వాటాను శుక్రవారం కొనుగోలు చేసినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం ఇచ్చింది. భారత్‌తోపాటు విదేశాల్లో ఆర్గానిక్ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రెండు నెలల క్రితమే శ్రేష్టలో మెజార్టీ వాటాను కొనుగోలు చేస్తున్నట్లు ఐటీసీ ప్రకటించింది. దీనికి అనుగుణంగా ఈ వాటాను 100 శాతానికి పెంచుకున్నది. ప్రస్తుతం ఎస్ఎన్‌బీపీఎల్..100 రకాల ఆర్గానిక్ ఉత్పత్తులు, బ్రాండెడ్ కిరాణా సామాగ్రి, సుగంధ ద్రవ్యాలు, మసాల దినుసులు, వంటనూనెలు, పానీయాలు, ఇతర వస్తువులను విక్రయిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను శ్రేష్ట రూ.306.1 కోట్ల ఆదాయాన్ని గడించింది. 27 వేల మంది రైతులు, 1.4 లక్షల ఎకరాల సర్టిఫైడ్ ఆర్గానిక్ భూమి, 10 రాష్ట్రాల్లో 71 క్లస్టర్లను కలిగివున్నది సంస్థ.